# గొంతు దిగని కన్నీళ్ళు

టి. విమల

త్రీ స్టార్ హోటల్లో, ఎయిర్ కండిషన్‌డు డబుల్ రూంలో సెటిలయ్యారు మధు, సూర్యం, ఆర్ముగం, చంద్రం.

ప్రతి 'సండే' యే హోటల్లోనో, సమావేశమై, 'మందు పార్టీ' చేసుకుని, కాసేపు సరదాగా కాలక్షేపం చెయ్యడం ఆ నలుగురు మిత్రులకీ రివాజు.

"ఇంకేమిటి ఆలస్యం?" అన్నాడు సూర్యం.

'క్వీన్ ఆఫ్ క్వీన్స్' ఫుల్ బాటిల్ ఓపెన్ చేసి, నాలుగు గ్లాసుల్లో కొంచెం కొంచెంగా పోసి, స్పెన్సర్ సోడా మిక్స్ చేశాడు మధు. ఇలాంటి పార్టీలు ఆర్గనైజ్ చెయ్యడంలో అతని కతడే సాటి. 'మందు' ఒక్కడే త్రాగితే ఆనందంలేదు. ఫ్రెండ్స్‌తో త్రాగినప్పుడే బ్రహ్మానందంగా వుంటుంది—అని అభిప్రాయపడుతూ, సంపాదించిన మొత్తాన్నీ 'బ్రాందీ'లా ఖర్చుచేస్తూ, ఎప్పుడూ మందు పార్టీలు ఇస్తూ, 'ఇదే నా జీవితాశయం' అని అభిప్రాయపడే మనిషి మధు.

"ఛీర్స్" అన్నారు మిత్రులు నల్గురూ ఒకేసారి—సాధ్యమైనంతవరకూ గ్లాసులు పైకెత్తి, 'డీ' కొట్టి.

గ్లాసుల్లోని మందు గొంతులో దిగుతోంది. గొంతులో దిగిన మందు కడుపులోకి జారుకొని నెమ్మదిగా నెమ్మదిగా మెదడుమీద పని చెయ్యడం ప్రారంభించి, కళ్ళల్లోకి మత్తుగా తొంగిచూస్తోంది.

"చికెన్‌ఫ్రై అద్భుతంగా వుందోయ్" అన్నాడు ఆర్ముగం—ఆత్రంగా చికెన్‌బోన్స్‌ని కరకరా నముల్తూ. ఆర్ముగానికి 'మందు' కంటే 'చికెన్' అంటేనే ప్రీతి మెండు.

చంద్రం త్రాగుతున్నాడన్న మాటేగాని, యెందుకో వెలితిగా వుంది. ఏదో అసంతృప్తి. 'రాజుకూడా వుంటే బావుణ్ణు' లోలోపల అనుకోవాలనుకున్నా ఆ మాటల్ని పైకే అనేశాడు చంద్రం.

రాజు కూడా ఆ మిత్రబృందంలోని వాడే. అతడంటే మిత్రులందరికీ యెంతో యిష్టం. కాని యిటువంటి పార్టీలకి దూరంగా వుంటాడని మిత్రులకి అతనిమీద కోపం.

"వాడెందుకు వొస్తాడోయ్. మనమేదో చెడిపోతున్నామని, మనం దేనికి పిలిచినా తప్పించుకు తిరుగుతుంటాడు వెధవ." అన్నాడు ఆర్ముగం—పొరపాటున యెక్కడ రాజుగాడు వొస్తాడో, తన చికెన్ వాటా యెక్కడ తగ్గిపోతుందోననే భయంతో.

"ఎంత లేదన్నా వాడు మన మిత్రుడు గదా. వాడ్ని తీసుకురావల్సిందే" అన్నాడు సూర్యం.

"యస్, యస్. ఈ రోజు యేమైనా సరే వాడ్ని మన మందు పార్టీ సభ్యుడిగా చేర్చుకోవాల్సిందే." అన్నాడు 'మందు సామ్రాట్'—మధు.

"కింకర్తవ్యం ఆలోచించండి. ఆలస్యం అమృతం విషం" అన్నాడు చంద్రం.

ఎవరు వెళ్ళాలి? అందుకు యెవరు సమర్థులు?....

ఆలోచనలో పడ్డారు మిత్రులు.

"అయిడియా" ఉన్నట్టుండి అరిచాడు ఆర్ముగం.

"చెప్పేడవ్వోయ్" విసుక్కున్నారు మిగిలిన వాళ్ళు.

"వాడసలే రాస్కెల్ వెధవ. మనలో యెవరు వెళ్ళినా రాకపోవచ్చు. పైపెచ్చు మనలో యెవరికీ వాడిల్లు తెలీదు—ఒక్క చంద్రానికి తప్ప. సో—చంద్రం వెళ్ళి పికప్

చేసుకు రావల్సిందే" అన్నాడు అర్ముగం—ఎంతలేదన్నా రాజు తమ మిత్రుడు గదా తన చికెన్ వాటా తగ్గిపోతే తగ్గిపోయిందిలే అని తనకి తానే తృప్తిపడి.

"ఓకే....ఓకే. ఏమంటావోయ్ చంద్రశేఖరా?" అన్నట్లుగా చూశారు మిత్రులు చంద్రంవైపు.

"ఓ. కే....ఐయాం రెడీ" అన్నాడు చంద్రం, చేతులు త్రిప్పి, భుజాలు యెగర వేస్తూ.

ఆ తర్వాత గ్లాసులో మిగిలిన కాస్త మందునూ గొంతులో పోసుకొని, గోల్డుఫ్లాక్ కింగ్ సిగరెట్ ముట్టించుకొని, టీపాయ్ మీదున్న స్కూటర్ 'కీస్' తీసుకొని, హుషారుగా కదిలాడు చంద్రం.

"ఖాయ్! నువ్వేం దిగులుపడకు. నీ వాటా నీకే భద్రంగా వుంటుందిలే" అన్నాడు జోక్ చేస్తూ సూర్యం.

స్ప్రింగ్‌డోర్ లాగి పట్టుకొని, బయట పడటానికి సిద్ధపడుతోన్న చంద్రం, రెండడుగులు వెనక్కివేసి, గ్రౌచోఫెల్లో పోజుపెట్టి, స్టైలిష్‌గా "థాంక్యూ" అని, గుబుక్కున బైటికి దూకాడు.

మధు రెండవ రౌండు కలపడానికి సిద్ధపడ్డాడు. కాని అర్ముగం చికెన్‌ఫ్రై తింటంలోనే మునిగిపోయి, యింకా ఫస్టు రౌండే ఫినిష్ చెయ్యలేదు.

"తొందరగా కానివ్వోయ్" విసుక్కున్నాడు మధు.

వాములు తినే స్వాములకి పచ్చగడ్డి ప్రసాదంలా—పీపాలకి పీపాలు స్వాహాచేసే మధుకి మొదటి రౌండ్ జస్టు వాసన చూసినట్లుగా వుంది. యెంత 'మందు'తొందరచేసినా ఫార్మాలిటీస్ అంటే ప్రాణం పెట్టే మధు, అందుకే అర్ముగాన్ని తొందరచేశాడు.

అయిష్టంగానే తన గ్లాసులో వున్న మందునంతా ఒక్కసారిగా గొంతులో పోసుకుని, ముఖం చిట్లించి, వాంతి రాకుండా ఓ చికెన్ ముక్కని నోట్లోకి దూర్చేసుకొన్నాడు అర్ముగం.

రెండవ రౌండ్ మిక్స్ చేశాడు మధు.

"రేడియో ఆన్ చెయ్యవోయ్ అర్ముగం" అన్నాడు సూర్యం విలాసంగా కుషన్‌చైర్లో వెనక్కివాలి, తాపీగా సిగరెట్టు పొగలతో మేఘాల్ని సృష్టిస్తూ.

రేడియో ఆన్ చేశాడు అర్ముగం.

'లో' వాయిస్‌లో మెలోడియస్ వాయిస్‌తో వస్తోంది రేడియోలోంచి పాట.

"వాహ్వా! వాహ్వా....ఏమి వాయిసూ....ఏమి వాయిసూ...." అన్నాడు మధు యే గత స్మృతుల్ని నెమరువేసుకుంటో.

నెమ్మది నెమ్మదిగా 'మందు' గొంతులు దిగుతోంది. మత్తు మత్తుగా వుంది. మాటలు ముద్దుగా మొద్దుగా వస్తున్నాయ్. మిత్రులకి హుషారు హుషారుగా వుంది.

రేడియోలోంచి పాట సన్నగా వినిపిస్తూనే వుంది.

'డిమ్' లైట్ వెలుతుర్లో, మందు చప్పరిస్తూ, చికెన్‌ఫ్రై మటన్‌ఫ్రైలు నములుతూ, సిగరెట్స్ ఊదేస్తూ, కబుర్లలో పడ్డారు మిత్రులు ముగ్గురూ.

పోలిటిక్సూ, సెక్సూ, క్రైమూ, థ్రిల్ సినిమాలూ, అమ్మాయిలూ, వంటింటి రచనలూ, పత్రికలూ, జర్నలిజమూ, చదువులూ, ఉద్యోగాలూ, నిరుద్యోగ సమస్యా, పెరిగే ధరలూ....వాట్ నాట్... అన్ని టాపిక్సుమీదా అనర్గళంగా లెక్చర్లు సాగిపోతున్నాయి.

ఇంతలో కాలింగ్‌బెల్ శబ్దం....

"యస్—కమిన్ ప్లీజ్" అన్నాడు సూర్యం.

తలుపు నెట్టుకొని లోనికొచ్చారు—ముందు చంద్రం, ఆ వెనకే రాజు.

"యువరాజాగారికి స్వాగతం ... సుస్వాగతం" అన్నాడు అర్ముగం.

"వీడ్ని పట్టుకొచ్చేసరికి నా తలప్రాణం తోకొచ్చింది" అన్నాడు చంద్రం సోఫాలో

కూలబడి, గ్లాసులో వున్న మందుని గొంతులో పోసుకుంటూ.

"ఈ రోజు యెంతో మరుపురానిది. యువ రాజాగారు యింతకాలానికి మాపై కరుణించి, మా ఆతిధ్యాన్ని స్వీకరించడానికి వచ్చినందుకు మా అందరి తరుపునా నా థాంక్స్" అన్నాడు సూర్యం.

మధు మరో గ్లాసు తీసుకొని, మందు పోసి, సోడా కలిపి, రాజు ముందుకు నెట్టి "తీసుకో" అన్నాడు.


నవ్వి మౌనంగా వుండిపోయాడు రాజు.

"ఎందుకోయ్ అలా నవ్వుతావ్? ఇంతకీ అసలు నీ ఉద్దేశం యేమిటి? నీ ఉద్దేశంలో మేమంతా చెడిపోయినట్లా? అందుకేనా నువ్వు మాకు దూరంగా తప్పుకు తిరుగుతున్నావ్? చెప్పరా? చెప్పు?" ఆర్మొగం కోపంగా అరిచాడు. మామూలుగానే పెద్ద నోరు. ఇక మందు పడితే చెప్పనే అవసరంలేదు,

సమాధానం చెప్పలేదు రాజు.

"యు మస్ట్ టేక్" బలవంతం చేశాడు మధు.

"యస్, యు మస్ టేక్. తీసుకోవా



ల్సిందే....యేమిట్రా అలా వెర్రిమొఖం వేసు కొని చూస్తావ్? 'మందు' తీసుకుంటున్న మేమంతా వెధవలమనా నీ ఉద్దేశం? అసలు నీ ఉద్దేశం చెప్పేడవరా? మేము కాఫీకి పిలిస్తే రావు, సిగరెట్ ఆఫర్ చేస్తే తీసుకోవు. సినిమా చూద్దామంటే వినవు. పేకాట అంటే 'అయ్య బాబోయ్' అంటావు. డ్రింకు తీసుకోరా అంటే 'నో థాంక్స్' అంటావు. అసలు యేమిటి నీ ఉద్దేశం? చెప్పరా? చెప్పు? ఈ భూమ్మీద నువ్వొక్కడివే అక్కడికి మహా బుద్ధిమంతుడివై పోయినట్లూ, మేమంతా చెడిపోయి, యెందుకూ పనికిరాని వెధవలమై పోయినట్లూ ఏమిట్రా నీ ఉద్దేశం? చెప్పరా ఫూల్... చెప్పు...." ఉద్రేకంగా అరుస్తున్నాడు మధు.

తన మిత్రులు అనరానిమాటలు అంటున్నా నోరు మెదపలేదు రాజు. తన హృదయం పళ్ళ చక్రాలక్రింద నలిగిపోతున్నట్లుగా బాధపడ్డాడు. ఏమిటి? తను తన సేహితుల్ని అపార్థం చేసుకుంటున్నాడా! లేక తననే వాళ్ళు అపార్థం చేసుకున్నారా? దీనికంతకీ కారణం యేమిటి? యెవరు కారణం?

బుర్ర వేడెక్కిపోతోంది రాజుకి.

తన నెందుకు మిత్రులు అర్థం చేసుకోలేక పోతున్నారు? ఇదేనా ఫ్రెండ్‌షిప్‌కి అర్థం? ఇదేనా యింతకాలం స్నేహంచేసి వీళ్ళు తనని అర్థం చేసుకొన్న తీరు?

అవును. ఎలా అర్థం చేసుకుంటారు? ఇంతకంటే యెవరు మాత్రం యెలా అర్థం చేసుకోగలరు? అసలు దీనికంతకీ ఒక విధంగా బాధ్యుడు తనే నేమో! తనెప్పుడైనా తన మిత్రులకి అర్థమయ్యే రీతిలో ప్రవర్తించాడా? పోనీ యెప్పుడైనా తన మనసులోని బాధని మిత్రులతో చెప్పుకున్నాడా? లేదే! చెప్పుకోలేదు. అందుకు ప్రతిఫలంగా యింతవరకూ తన నెంతో గౌరవించే మిత్రులే ఈరోజు తనని అపార్థం చేసుకుని, అనరాని మాట లంటున్నారు.

ఇక లాభంలేదు. ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ తన బాధని తనలోనే దాచుకొని యెలాగో భరించగలిగాడు. ఇక ఉపేక్షించి లాభం లేదు. తన నిర్లిప్తత యింకెన్ని దారుణ పరిణామాలకు దారి తీస్తుందో! అలా జరగటానికి వీల్లేదు. తన మిత్రుల అపోహను తొలగించాలి. కాని. ..కాని. ..తప్పదు. స్నేహంలో అపార్థాలకు తావుండకూడదు....అ ం తే.... అంతే....

ఏదో నిర్ణయానికి వచ్చినట్లుగా ముందుకు వంగాడు రాజు.

టీపాయ్‌మీద తన కోసం పెట్టిన మందు గ్లాసుని అందుకొని ఎత్తిపట్టి, కళ్ళు మూసుకొని, గొంతు మండుతున్నా, అలవాటులేని వాసన ముక్కుపుటాల్ని బ్రద్దలు చేస్తున్నా, గడగడా తాగేశాడు రాజు.

ఆ తర్వాత టేబిల్‌మీది సిగరెట్ ప్యాకెట్ అందుకొని, ఓ సిగరెట్ తీసి వెలిగించుకొని గబగబా రెండు దమ్ములు లాగి అలవాటు లేనందువల్ల ఉక్కిరి బిక్కిరై పోయాడు.

ఇదంతా చూస్తున్న చంద్రం తనేదో ముళ్ళమీద కూర్చున్నట్టుగా ఫీలవసాగాడు.

రాజుని కంపెనీగా వుంటాడని తీసుకొచ్చాడు తను. కాని యిదేమిటి? రాజు తాగేస్తున్నాడు అలవాటు లేకపోయినా?

"శహబాష్ రాజూ! శహబాష్! ఇప్పుడు నిజంగా నాకు నచ్చావ్. మా మిత్రుడివి అనిపించుకున్నావ్." అన్నాడు చప్పట్లుకొడుతూ మధు.

ఆర్ముగం సోఫాలోంచి లేచి, రాజుదగ్గరికి వెళ్ళి కౌగలించుకొని, "నౌ! యు ఆర్ మై ఫ్రెండ్!" అన్నాడు వికారంగా నవ్వుతూ.

సూర్యం త్రాగుతూ మౌనంగా వుండిపోయాడు, అక్కడ జరుగుతోన్న డ్రామాని చూస్తూ. కాని చంద్రానికి మాత్రం ఏదో బాధగా వుంది. ఏదో చెప్పాలనీ, ఏదో మాట్లాడాలనీ వుంది. కాని ఎవరికీ ఏమీ చెప్పలేని నిస్పృహాయ స్థితిలో వుండిపోయాడు చంద్రం.

మధు మూడవ రౌండు కలిపాడు.

"నాక్కూడా ఫ్రెండ్" అన్నాడు రాజు.

ఆశ్చర్యపోయారు మిత్రులు.

రాజు గ్లాసులో కూడా మందుపోసి, సోడా కలిపాడు మధు. గ్లాసందుకొని గడగడా తాగేశాడు రాజు. రాజు త్రాగుతుంటే వారించాలనుకున్నాడు చంద్రం. కాని వారించలేకపోయాడు.

రాజుకిప్పుడు ఆనందంగా వుంది. ఏదో ప్రపంచంలో తేలిపోతున్నట్లుగా వుంది. వొళ్ళు తూలుతోంది. కళ్ళు బరువుగా వాలిపోతున్నాయి. మెదడంతా మొద్దుబారిపోయినట్లుంది. గుండెల్లో పేరుకుపోయిన బాధ పెల్లుబికి కట్టలు తెంచుకుని బయటపడాలని తెగ ఆరాటపడిపోతోంది.

ఇక ఇప్పుడు మాట్లాడగలడు. అవును. మాట్లాడాలి..

మరో సిగరెట్ ముట్టించుకొని, గొంతు సవరించుకున్నాడు రాజు.

"మైడియర్ ఫ్రెండ్స్! ఇప్పుడు మీకు చాలా ఆనందంగా వుండి వుండాలి. యామై కరెక్ట్...." అన్నాడు రాజు.

"షూర్....షూర్..." అన్నారు ఆర్ముగం, మధు విలాసంగా బ్రాందీని సిప్ చేస్తూ.

"కాని.... ఫ్రెండ్స్! నాదొక రిక్వెస్టు. మీరేదో తాగి చెడిపోతున్నట్లూ, అందుకే మీ నుండి నేను దూరంగా తప్పుకు తిరుగుతున్నాననీ ఇంతకుముందే మీరు నన్ను 'బ్లేమ్' చేశారు. ఆ మాటకొస్తే నేనూ ఇప్పుడు త్రాగాను. అంటే నేనూ చెడిపోయినట్లే లెఖ్ఖ. కాని మరెప్పుడూ నన్ను త్రాగమనీ, నా కిష్టం లేని పనులు చేయమనీ నన్ను బలవంతం చెయ్యకండి. ప్లీజ్, నన్నింకా దిగుళ్ళతో చంపకండి...." అన్నాడు రాజు.

"ఏమిటీ? నీకు దిగుళ్ళా? వాటే వండర్!"

"నీకేమిటోయ్! ఎప్పుడూ తెల్లని మల్లెపువ్వుల్లాంటి బట్టలతో పూలరంగడిలా వుంటావ్."

"అయినా నువ్వేం పదిమంది పిల్లల్ని పోషించాలా ఏమిటోయ్ నువ్వూ మీ ఆవిడేగా సంసారం?"

"కాదులేరా. మనలాగా పార్టీలనీ, ఫ్రెండ్స్ అనీ డబ్బు ఖర్చు చేస్తే ఎలా! బ్యాంకు బాలెన్స్ పెంచుతున్నట్లున్నాడు గురుడు. ఎంత లేదన్నా ముందు జాగ్రత్త మనిషి."

స్నేహితులు తలో రకంగా అంటున్నారు. ఆ మాటలు వినలేకపోయాడు రాజు. "స్టాప్... స్టాప్...." పెద్దగా అరిచాడు.

బిత్తరపోయారు మిత్రులు.

"....... మీ మాటలకు అడ్డొచ్చినందుకు క్షమించండి.... కాని నేను చెప్పేది కూడా వినండి. మీరు నా తెల్లని బట్టల్నే చూశారు. కాని నా గుండెల్లో అలుముకొన్న అంధకారాన్ని చూడలేదు. నిజానికి నాకెన్ని జతల బట్టలున్నాయో మీకు తెలుసా? తెలీదు. ఒకవేళ నేను చెప్పినా మీరు నమ్మకపోవచ్చు. కాని ఇది నిజం... నాకున్నవి రెండే రెండు జతలు. ఒకటి వొంటిమీద వుంటుంది. ఒకటి ఉతికి, ఆరేసి దండెంమీద వుంటుంది.

"ఈజిట్........" నమ్మలేనట్లు చూశాడు ఆర్ముగం.

"అవును. నేను చెప్పింది నిజం....మీకు తెలిసిన నేను-ఒక పెద్ద ఆఫీసర్ని. ఏడెనిమిది

# "గీతో"పదేశం

గతం
గరళం
గ్లాసు పారెయ్

భావి
ఎండమావి
పరుగు ఆపెయ్
స్మృతుల్ని
వొదిలేయ్
స్వప్నాల్లోంచి వొచ్చేయ్

వర్తమానం
వొకటే సత్యం
ప్రస్తుతం వొకటే అమృతం.

—టి. చంద్రశేఖరరెడ్డి

వందల జీతగాడ్ని. కాని మా ఇంట్లో రెండు పూటలా భోజనం మినహాయించి కాఫీ, టిఫిన్లు లాంటి ఆర్భాటాలేమీ వుండవు. ఆఫీసులో గానీ, బయటగానీ, నేనెప్పుడూ కాఫీ నీళ్ళకు నోచుకోలేదు. ఫ్రెండ్సుకోసం కానీ ఖర్చుపెట్ట లేదు నేను. అంతే కాదురా. నా పెళ్ళాంకోసం పదిపైసలుపెట్టి పూలు కొని ఇంటికి తీసుకెళ్ళ లేదంటే మీరు ఆశ్చర్యపోతారు. ఇంతవరకూ నా భార్యని ఒక్క సినిమాకూడా తీసుకెళ్ళ లేదంటే మీరు షాక్ తినొచ్చు. కాని ఇది నిజం. అయినప్పటికీ నా భార్య నన్నెప్పుడూ అదికావాలనీ, ఇదికావాలనీ పీడించుకు తిన లేదు. అందుకే నాకెంతో గర్వంగా వుంటుంది- నన్నర్థం చెసుకొని నాతో సర్దుకుపోయే భార్య దొరికినందుకు...." రెండు నిముషాలు ఆగాడు రాజు. మరో సిగరెట్ వెలిగించుకొని పొగ వొదులుతూ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"డియర్ ఫ్రెండ్స్! ఇంతకాలం నుండి మనం కలిసి తిరుగుతున్నాం. కాని ఎప్పుడైనా మిమ్మల్ని మా ఇంటికి ఆహ్వానించి, కప్పు కాఫీ మీ మొహాన పోశానా? ఒక్క పూట భోజనం పెట్టానా? చెప్పండిరా చెప్పండి. నే నెప్పుడూ అంత సాహసం చెయ్యలేక పోయాను. కాని—మీరు నన్ను కాఫీలకి పిలిచేవారు. సినిమాలకి పిలిచేవారు. షికార్లకి పిలిచేవారు. విలాసాలకి పిలిచేవారు. కాని నే నెలా వస్తాన్రా.... చెప్పండి. ఫ్రెండ్ షిప్ ఫ్రెండ్ షిప్పే. అంతమాత్రం చేత అభి మానాన్ని చంపుకోవలసిన అవసరం లేదు గదా! నాకూ మనస్సుంది. నాకూ అభిమానం వుందిరా. అందుకే మీరు పిలిస్తే నేను వొచ్చే వాడ్నికాదు. మీరు నాకోసం పదిరూపాయలు ఖర్చుచేస్తున్నప్పుడు అందులో పదోవంతు కూడా ఖర్చుచేయలేని నేను ఎలా మీరు పిలిస్తే రమ్మంటారు. చెప్పండిరా....చెప్పండి....

"మీకు తెలిసిన నేను—ఏ బాదరబందీలేని ఒక పెద్ద జీతగాడ్ని. కాని మీకు తెలీని నేను- ఎన్నో బరువులూ, బాధ్యతలూ నెత్తిన వేసు కొని అప్పులతో, అవస్థలతో, దిగుళ్ళతో, గుండె పగుళ్ళతో సతమతమైపోతున్న ఒక అభాగ్యుడ్ని....ఇన్ని బాధ్యతలూ పెట్టుకొని ఏ బాధ్యతలూలేని మీతో నేనెలా ఉల్లాసంగా కాలం గడపగలను? అవున్రా. అవును. మీకు బాధ్యతల్లేవు. బరువుల్లేవు. మీ వెనక మీ తల్లి దండ్రులో, తాత ముత్తాతలో సంపాదించి పెట్టిన బోల్డంత ఆస్తి వుంది. మీకు మంచి మంచి ఉద్యోగాలున్నాయ్. మంచి మంచి బిజి- నెస్ లూ వున్నాయ్. మీ సంపాదనమీద బ్రతకా లనుకునే వాళ్ళు లేరు. అందుకే మీ సంపాద నంతా జల్సాలకు వినియోగించుకుంటున్నారు. కాని అలాంటి జీవితం నా కెలా కుదురుతుంది? చెప్పండిరా....చెప్పండి.

"నా జీతంలోనే—కేవలం నా జీతంలోనే ప్రస్తుతం మేముండే ఇంటికి అద్దెకట్టాలి. పాల బాకీ కట్టాలి. పెరిగే ధరల్ని తిట్టుకుంటూ ఈ సిటీలో నేనూ నా భార్యా బ్రతకాలి. మా ఊర్లో వున్న ముసలి తండ్రినీ, ఎన్నో సంవత్సరాల నుండి మంచంలో తీసుకొంటున్న మా అమ్మనీ, మా అమ్మ రోగానికి అయే మందుల బిల్లునీ, డాక్టరు ఫీజుని నేనే భరించాలి... ఇద్దరు తమ్ముళ్ళని చదివించాలి. నా ముగ్గురు చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యాలి. చూశారా? ఎన్ని బాధ్యతలో! ఇవన్నీ చాలవన్నట్లు మొన్నీ మధ్యనే భర్త చనిపోయి, ఆదరించే దిక్కు లేక నల్గురు పిల్లల్ని వెంటేసుకొని పుట్టిల్లు చేరింది మా పెద్ద అక్కయ్య. ఎవర్నికాదనేది? చెప్పండి....పోనీ వీళ్ళందర్నీ పోషించడానికి మా నాన్న ఉన్నవాడేం కాదు. ఉన్న ఒక్క ఎకరం పొలాన్నీ అమ్మేసి, నేనేదో ఉద్ధరిస్తా నని, నామీద నమ్మకంతో, విశ్వాసంతో నన్ను చదివించి, నన్నింతవాడ్ని చేశాడు మా నాన్న. అటువంటిది—నా వాళ్ళనందర్నీ ఎలా నట్టేట్లో ముంచగలను?నన్నెలా ద్రోహిని కమ్మంటారు? నాకు నేను ఆత్మద్రోహం ఎలా చేసుకో మంటారు? చెప్పండిరా....నేనేదో చదువుకొని గట్టెక్కి, మాంచి ఉద్యోగమే చేసుకొంటు న్నాను కాబట్టి, నా సుఖాలు నేను చూచు కుంటూ, నా వాళ్ళని—నన్ను నమ్ముకున్న నా వాళ్ళు—నామీద ఎన్నో ఆశలు పెట్టుకొని

ఒక్కపూటైనా కనీసం కడుపునింపుకొంటున్న నా వాళ్ళని—నట్టేట్లో ముంచెయ్యమంటారా? చెప్పండి....

"మీకు కాలుమీద కాలేసుకొని తిన్నా తరగని ఆ సిపాస్తులున్నాయి. మీరేంచేసినా అదేమిటని అడిగేవాళ్ళుగానీ అడ్డగించేవాళ్ళుగానీ లేరు. కాని అలా నాకెలా కుదురుతుంది? చెప్పండిరా చెప్పండి....అందుకే నన్ను నేను నిగ్రహించుకుంటూ, సుఖాలకి దూరంగా బ్రతుకుతున్నాను. అందుకే మీరు నన్ను అపార్థంచేసుకున్నారు.

"ఒరేయ్! మీకు కోపమొస్తే నన్ను కొట్టండి, తిట్టండి. ఇంకేమైనా చెయ్యండి. అంతేగాని నన్ను అపార్థం చేసుకొని, నన్ను మీనుండి దూరం చెయ్యకండి. నన్ను నెట్టేయకండిరా....ఇంతకాలం నేను సుఖంగా గడిపిన క్షణాలు కేవలం మీతో నవ్వుతూ, తుళ్ళుతూ గడిపిన క్షణాలే రేయ్....ఆ అదృష్టాన్ని కూడా నాకు దూరం చెయ్యకండిరా....

"ఒరేయ్!.... ఇంతకంటే నా జీవితంలో మరో విషాద సంఘటన వుంది. చెప్తాను. వినండిరా. నా బాధ్యత, నా వాళ్ళకూ నాకూ మధ్య వున్న ప్రేమపాశం, రక్తసంబంధం నన్నెంత ఘోరం చేయించిందో చెప్తానువినండి. నేను నావాళ్ళకి సహాయం చేస్తుంటే నా భార్య ఇంతకాలం కాదనలేదు. కాని రేపు తనకూ పిల్లలుపుట్టి వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయితే, నా జీతం సరిపోయే మాట ఎలావున్నా నా భార్య అప్పుడు నా వాళ్ళకి సహాయపడటానికి వొప్పుకుంటుందా? నో... వొప్పుకోదు. తన కడుపున పుట్టిన పిల్లల్నికాదని పరాయివాళ్ళకి పెట్టడానికి నా భార్య వొప్పుకోదు. నేనూ అప్పుడు నా మనసు మార్చుకోవచ్చునేమో....అప్పుడు నా వాళ్ళందరూ ఆకలి మంటలకు తట్టుకోలేక నల్లుల్లా మాడి మసైపోతారు....నో....నో.... అలా జరగటం నేను ఊహించలేను. అందుకే అందుకే.... నాకు పిల్లలు పుట్టకుండా నా సంసారం వృద్ధిచెందకుండా నేను ఆపరేషన్ చేయించుకున్నానురా. ఆపరేషన్ చేయించుకున్నాను.... పిల్లలంటే ఎంతో ఇష్టపడే నా భార్యకు ఒక విధంగా చెయ్యరాని ద్రోహం చేశానురా....ద్రోహం చేశాను. ఇదంతా కేవలం నావాళ్ళకోసం, నన్ను నమ్ముకున్నవాళ్ళకోసం, నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్నవాళ్ళకోసం. అందుకేరా అందుకేరా....అన్ని సుఖాలకి అతీతంగా బ్రతుకుతున్నాను, విధిలేక.

"ఒరేయ్! నన్ను అర్థం చేసుకోండిరా.... నేను మీ ఫ్రెండుని. నన్నెప్పుడూ కష్టపెట్టి మీరు మనసుని కష్టపెట్టుకోకండిరా" గొల్లున ఏడుస్తున్నాడు రాజు.

మిత్రులంతా ఒకరి మొఖాలొకరు చూచుకున్నారు.

చంద్రానికి మరీ దిగులుగా వుంది.

చిన్నపిల్లాడిలా ఏడుస్తున్న రాజుని చూస్తుంటే గుండె బరువెక్కింది. అప్పటివరకూ చేతిలో వున్న గ్లాసులోని మందు ఒక్కసారిగా గొంతులో పోసుకున్నాడు.

ఇంతకాలం అలవాటుగా గొంతులో పోసుకోగానే అమృతంలా మెత్తగా కడుపులోకి జారిపోయే మందు, ఆ రోజెందుకో, రాజు కార్చిన కన్నీటిలా, ఉప్పగా, అదోరకంగా గొంతు దిగటంలేదు. గొంతులోనే నిలిచిపోయింది. □

## త్రికోణ స్మృతి

స్మృతి
అస్తమించిన అనుభవాల్ని
గతంలోంచి తోడే
బొక్కెన

ఆశ
రేపటికి అని
వుదయించే స్వప్నాల్ని చూపే
నిచ్చెన.

తడిసే, మెరిసే
రెప్పల స్థితి
ఎప్పుడూ వొకే స్థానంలో
వర్తమానంలో—

—టి. చంద్రశేఖరరెడ్డి